ప్రజాశక్తి
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

# పోలింగ్ కేంద్రాల్లో టిడిపి శ్రేణులు హల్‌చల్

**యథేచ్ఛగా రిగ్గింగ్, దొంగ ఓట్లు ● ఎన్నికల అధికారులపై తీవ్రస్థాయిలో వొత్తిడి ● ప్రలోభాల పర్వం ● ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేసిన నేతలు ● చూసీచూడనట్లు వ్యవహరించిన పోలీసులు**

**విజయవాడ, కృష్ణా ప్రతినిధి**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో పలుచోట్ల కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు బూత్‌లలోకి ప్రవేశించి ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేశారు. రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ప్రభుత్వం అండ, కూటమి ఎంఎల్‌ఎల వెన్నుదన్నుతో పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పలు వ్యవహారాలు నడిచాయి. పలు పోలింగ్ కేంద్రాల్లోకి కూటమి నేరుగా ప్రవేశించి బూత్ ఏజెంట్లతో మంతనాలు జరుపుతూ...ఓటింగ్ సరళి, పోలింగ్ శాతం ఎంత నమోదైంది, ఎవరెవరు ఓటర్లు వచ్చారు, రాని ఓటర్ల ఆరా తీస్తూ...అక్కడికక్కడే సమాచారం మొత్తాన్ని బయట ఉన్న తమ శిబిరాల్లోని శ్రేణులకు చేరవేసినట్లు తెలిసింది. కూటమి నేతలు ఓటర్లను పలు రూపాల్లో ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేసినట్లు చెబుతున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బలస్వామి, టిడిపికి చెందిన ఓ కార్పొరేటర్ భర్త సివిఆర్

విజయవాడ పటమట హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు; బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్, పోలింగ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల అధికారి (కింద)



| జిల్లా పేరు | కేంద్రాలు | ఓటర్లు | పోలైనవి | శాతం |
|---|---|---|---|---|
| ఏలూరు | 21 | 16099 | 11801 | 73.30 |
| కృష్ణా | 77 | 63114 | 44125 | 69.91 |
| ఎన్‌టిఆర్ | 112 | 78063 | 51279 | 65.69 |
| గుంటూరు | 149 | 108109 | 71836 | 66.45 |
| బాపట్ల | 34 | 24493 | 18198 | 74.30 |
| పల్నాడు | 90 | 57238 | 44263 | 77.33 |
| మొత్తం | 483 | 347116 | 241502 | 69.57 |

## బుద్ధా బెదిరింపులు, దౌర్జన్యాలు

విజయవాడ గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, భవానీపురంలోని పలు పోలింగ్ బూత్‌ల్లోకి టిడిపి పశ్చిమ నియోజకవర్గ నాయకులు, మాజీ ఎంఎల్‌సి బుద్ధా వెంకన్న దౌర్జన్యంగా ప్రవేశించారు. పోలింగ్ అధికారులను, పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేశారు. భవానీపురం ఆర్‌టిసి కాలనీ పరిధిలోని ఓ పోలింగ్ బూత్‌లోని పోలింగ్ ఆఫీసర్ (పిఒ)పై వత్తిడి తీసుకొచ్చి బయటకు వెళ్లిపోవాలని, పోలింగ్ బూత్‌లో గంట సేపు ఎవరూ ఉండటానికి వీలు లేదని పిఒపై వొత్తిడి తీసుకొచ్చారు. అయితే అక్కడే ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి మహిళా ఏజెంట్ ఆయన చర్యను గట్టిగా ప్రతిఘటించారు. దీంతో ఆ మహిళా ఏజెంట్‌పై బుద్ధా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఆమె మరింత గట్టిగా ప్రతిఘటించారు. ఏజెంట్‌కు మద్దతుగా నిలిచిన పలువురు సంఘటితంగా బుద్ధా చర్యను తిప్పికొట్టారు. అలాగే గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో రిగ్గింగ్‌కు పాల్పడుతున్న బుద్ధాను అక్కడే ఉన్న డిసిపి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంకా ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, కంచికచర్ల మండలాల పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లలో పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లపై అధికార టిడిపి నాయకులు బెదిరింపులకు దిగారు. రిగ్గింగు చేసి దొంగ ఓట్లు వేశారు. నందిగామ, జగ్గయ్యపేటల్లో కూడా ఇదేరీతిన వ్యవహరించారు. మైలవరంలో పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్‌ను బయటకు పంపి బూత్‌లలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లలోకి స్థానిక ఎంఎల్‌ఎలు జొరబడి అక్కడే తిష్ట వేసినా స్థానిక తహశీల్దార్లు, ఆర్‌ఐలు, ఎన్నికల అధికారులు మిన్నకుండిపోయారు

## టిడిపి నేతల అరాచకంపై చర్యలు తీసుకోవాలి

**సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ**

విజయవాడ గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, భవానీపురంలోని పలు పోలింగ్ బూత్‌ల్లోకి టిడిపి పశ్చిమ నియోజకవర్గ నాయకులు, మాజీ ఎంఎల్‌సి బుద్ధా వెంకన్న దౌర్జన్యంగా ప్రవేశించి, పోలింగ్ అధికారులను, పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేశారని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తెలిపారు. బుద్ధా వెంకన్న అరాచకాలపై ఉన్నత స్థాయి అధికారులు సమగ్రంగా విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పెనుగంచిప్రోలు, కంచికచర్ల మండలాలు, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం ప్రాంతాల్లో పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లపై అధికార టిడిపి నాయకులు బెదిరింపులకు దిగారని, రిగ్గింగు చేసి దొంగ ఓట్లు వేశారని తెలిపారు. ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేయడం, అధికారులపై వత్తిడి తీసుకురావడం వంటి చర్యలపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత ఎన్నికల అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించినట్లు డి.వి.కృష్ణ తెలిపారు.

అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. పటమట జడ్‌పి హైస్కూల్ వద్ద కూడా కొంత ఉద్రిక్త పరిస్థితులకు కారణమయ్యారనే అంటున్నారు. ఎంఎల్‌ఎ గద్దె రామమోహన్‌రావు(మిగతా 2లో)

# బడ్జెట్‌పై ఆశలు !

- పెండింగ్‌లో పలు ప్రాజెక్టులు
- అసంపూర్తిగా కృష్ణా డెల్టా ఆధునీకరణ
- ముందుకు సాగని బ్యారేజీ దిగువన మరో రెండు బ్యారేజీల నిర్మాణం

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**


రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. సుదీర్ఘకాలంగా కృష్ణా డెల్టా ఆధునీకరణతోపాటు ఇతర తాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వాలు జపం చేస్తున్న జలజీవన్ మిషన్ (ఇంటింటికి కుళాయి) మాటలకే పరిమితమైంది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా అధ్వానంగా మారిన ఆర్ అండ్ బి రహదారులు, వంతెనలు నిర్మాణం ముందుకు సాగడంలేద. రాజధాని ఔటర్ రింగ్ రోడ్డు సమగ్ర నివేదికను విడుదల చేసింది. వీటితోపాటు సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేసిన సూపర్ సిక్స్ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయడానికి బడ్జెట్లో భారీగా కేటాయింపులు చేయాల్సి ఉంది.

కృష్ణా జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించడంతో పాటు, సముద్రపు ఉప్పు నీరు ఫెలోచానల్స్ (భూమి అంతర్గత నదీపాయలు)లోకి చొచ్చుకురాకుండా రెండు చోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని 2017లో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. వరదలు వచ్చిన సందర్భాల్లో ప్రకాశం బ్యారేజీకి దిగువన వృధాగా సముద్రంలో కలిసే జలాలను కొంత మేర అయినా నిల్వ ఉంచడానికి చోడవరం-రామచంద్రాపురం, బండికోళ్లలంక-తూర్పుపాలెం వద్ద చెక్ డ్యామ్‌లు నిర్మిస్తున్నట్లు అప్పట్లో జలవనరులశాఖ వెల్లడించింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం చెక్‌డ్యామ్ ప్రతిపాదనలు పక్కన పెట్టింది. 10 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో రూ.4,761.81 కోట్లతో బ్యారేజీలు నిర్మిస్తామని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 2022 తర్వాత ఏ బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అధిక వరదల సామర్థ్యాన్ని తట్టుకునేలా ఈ బ్యారేజీల నిర్మాణాన్ని చేపటడతామని చెప్పి మళ్లీ అంచనాలు రూపొందిస్తోంది. జిల్లాలోని 5 లక్షల




ఎకరాలకుపైగా సాగునీరు అందించే కాల్వలు, ముంపు సమస్యకు పరిష్కారంగా ఉన్న డ్రయినేజీ వ్యవస్థలను ఆధునీకరించాలి. రూ. 2,549 కోట్ల అంచనాతో ప్రారంభించిన కృష్ణాడెల్టా ఆధునీకరణ పనుల్లో రూ.865.33 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఈక్రమంలోనే అతివృష్టికి పంటలు మునగడం, అనావృష్టికి ఎండటం వంటి సమస్యలను రైతులు ఎదుర్కొంటున్నారు. బందరు, పుల్లేరు, రామరాజు ఛానల్ ఆధునీకరణలకు రూ.697 కోట్ల అంచనాలతో జలవనరులశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. గత ఏడాది బుడమేరు ముంపు దెబ్బకి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు మండలాల్లో మురుగునీరు మొత్తం అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల ద్వారానే సముద్రంలో కలుస్తుంది. తీర ప్రాంతాల్లోని సముద్రపు ఉప్పు నీరు పంట పొలాల్లోకి చొచ్చుకురాకుండా ఏర్పాటు చేసిన అవుట్‌పాల్ స్లూయిజ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ స్లూయిజ్‌ల నిర్మాణానికి రూ.2,400 కోట్ల

(మిగతా 2లో)



# వైభవంగా రథోత్సవం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** మహాశివరాత్రి సందర్భంగా విజయవాడ కెనాల్ రోడ్‌లో గురువారం సాయంత్రం రథోత్సవం వైభవంగా జరిగింది. విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ప్రారంభించారు. రథోత్సవంలో శ్రీ కనకదుర్గ మల్లేశ్వర స్వామివార్లు, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్లు, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివార్లు, శ్రీ గంగా పార్వతీ సమేత వసంత మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఉంచారు. రథం ముందు మేళతాళాలతో, కోలాట నత్యాలతో భక్తబందాలు సందడి చేశాయి. రథోత్సవంలో దుర్గగుడి డిప్యూటీ ఈవో రాజు, శ్రీ కన్యకా పరమేశ్వరి అన్న సత్రం కమిటీ అధ్యక్షులు బచ్చు వెంకటలక్ష్మి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బయన శ్రీ రాజేష్ ,కమిటీ సభ్యులు డోగిపర్తి శంకర రావు తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న సిపి

# ఎన్‌టిఆర్ జిల్లాలో 65.69 శాతం పోలింగ్

## 3న గుంటూరులో కౌంటింగ్

**ప్రజాశక్తి-విజయవాడ :** కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని, 65.69 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. 78,063 మంది ఓటర్లకు గాను 51,279 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినందున ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం దుకాణాలు మూసివేయడం, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం, స్థానికంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడం, ప్రత్యేక తక్షణ స్పందన బందాలు అప్రమత్తంగా ఉండటం.. ఇలాంటి చర్యలన్నీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసేందుకు దోహదం చేసినట్లు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో క్యూ లైన్లు పెద్దగా ఉన్నప్పటికీ అవసరమైన నీడ, తాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. గర్భిణీలు, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించి.. ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. మార్చి 3వ తేదీన గుంటూరులో కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. పోలింగ్ సజావుగా జరగడంలో మీడియా కూడా కీలకపాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా కలెక్టర్ లక్ష్మీశ ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల పరిశీలనలో నిమగ్నమయ్యారు. తొలుత విజయవాడ పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశనం చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలను కొనసాగించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. జగ్గయ్యపేటలోని గెంటేల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. తాగునీరుతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. నందిగామతో పాటు జి.కొండూరులోనూ పర్యటించి పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు.

**కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్**

జిల్లాలో పోలింగ్ ప్రక్రియ సక్రమంగా సాగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. 112 పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌క్యాస్టింగ్‌తోపాటు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం (సిసిసి) ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం నుంచి కలెక్టర్ నేతృత్వంలోని ప్రత్యేక బందం నిరంతర పర్యవేక్షణలో భాగమైంది. కలెక్టర్ లక్ష్మీశ కూడా సిసిసి నుంచి జిల్లావ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలించారు. సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు తదితరులు కంట్రోల్ రూం కార్యకలాపాల్లో భాగస్వాములయ్యారు.

## పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్‌పై దాడి హేయం

**ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగారెడ్డి, అప్పన్న**

**ప్రజాశక్తి - విజయవాడ :** ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌పై దాడిని పిఎన్ఎం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.వి.రంగారెడ్డి, పి.అప్పన్న తీవ్రంగా ఖండించారు. దాడులు మంచి సాంప్రదాయం కాదని, అప్రజాస్వామికమని వారు పేర్కొన్నారు. అత్యంత హేయమైన చర్యని పేర్కొన్నారు. దాడులతో ప్రజాస్వామ్యాన్ని అణచలేరని హెచ్చరించారు. స్వేచ్ఛగా మాట్లాడే వారిపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలని కోరారు. అనిల్‌పై దాడిని సీనియర్ కళాకారులు బొర్రా నరేన్, పొగర్తి నాగేశ్వరరావు, గుమ్మడి జీవన్ కుమార్, చంద్రా నాయక్, వేంపాటి రమేష్, ఆకురాతి జగన్మోహన్ రావు తదితరులు కూడా ఖండించారు.

## దొంగ ఓటర్లతో అరాచకం..అక్రమాలు

**ఎంఎల్ఎల కనుసన్నల్లో పోలింగ్**

**పోలింగ్ కేంద్రాల అక్రమణ, రిగ్గింగ్**

**అధికార యంత్రాంగం నిస్సహాయత**

**ప్రజాశక్తి - గుంటూరు ప్రతినిధి**

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలికి గురువారం జరిగిన పోలింగ్‌లో టిడిపి నాయకులు అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. వారి దౌర్జన్యాలు కొనసాగాయి. టిడిపితోపాటు కొన్ని చోట్ల జనసేనపార్టీ కూడా ఈ దౌర్జన్యాల్లో పాలుపంచుకుంది. పోలింగ్ ఉదయం మందకొడిగా ప్రారంభం అయిన మధ్యాహ్నం తరువాత వేగం పుంజుకుంది. పోలింగ్ శాతం కూడా పెరిగింది. టిడిపి తరుపున జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు పోలింగ్ కేంద్రాల్లో యథేశ్చగా సంచరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ప్రధానంగా పట్టభద్రుల పేరుతో నమోదు అయిన ఓటర్లు రాకపోతే వివిధ వృత్తుల్లో పనిచేసే అసలు చదువుకోని వారిని కూడా తీసుకు వచ్చి ఓట్లు వేయించిన ఘటనలు ఉన్నాయి. అలాగే ఏజంట్లును బెదిరించి అధికారులు కూటమి నాయకులతో కుమ్మక్కై దొంగ ఓట్లు వేసుకున్నారు. పోలింగ్ బూతులలో ఓటరు వద్ద ప్రూఫ్‌లు చూడకుండానే ఓటు వేసేందు అనుమతించడం, ఏమిటని పిడియఫ్ ఏజంట్లు ప్రశ్నిస్తే నోరు నొక్కేందుకు ప్రయత్నించడం ఇరువర్గాలకు మధ్య వాదనలు కూడా చోటు చేసుకొన్నాయి. ఎలాగైన గెలవాలని కూటమి నాయకులు ఓటర్లను అనేక రకాలుగా ప్రలోభాలకు గురి చేశారు.

## మచిలీపట్నంలో ఓటు వేసిన మంత్రి కొల్లు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవడమే ధ్యేయంగా యువత ముందుకొచ్చి ఓట్లు వేశారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం హిందూ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు.



## అక్రమాలకు తెగబడ్డ అధికార పార్టీ

**పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు**

**ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా) :** కృష్ణ, గుంటూరు జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు తెగబడుతోందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు తీవ్రంగా విమర్శించారు. గురువారం మంగళగిరిలో సికె హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలోని దుర్గి, బెల్లంకొండతో పాటు మరికొన్ని మండలాల్లోని కొన్ని బూత్‌లలో మా తరపు ఏజెంట్లను బయటకు పంపారు. ఇదేమి న్యాయం? మీకు చేతనైతే తలపడండి.. అంతేగాని, ఏజెంట్లను అలా బయటకు పంపడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలిలో మున్సిపల్ హైస్కూల్‌లోని ఏడు బూత్‌లలో కోగంటి శివయ్య అనే వ్యక్తి పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంగళగిరిలో కూడా ఆ విధంగానే జరుగుతోంది. అధికార పార్టీ వాళ్లు గేటు దాకా వచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. మేము ప్రచారం చేసుకోకూడదు. ఇదెక్కడి న్యాయం? ఇవి సహజన్యాయ సూత్రాలా? వీటన్నింటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నాం అని తెలిపారు. ప్రజలు, గ్రాడ్యుయేట్స్ మద్దతు పొందలేకపోవడంతో జావగారిపోయి ఇలాంటి పద్ధతులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వీటిని మేం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికార పార్టీ పాల్పడుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులపై ఎన్నికల సంఘం అధికారి వివేక్ యాదవ్‌కి, ఆర్‌వో, జిల్లా కలెక్టర్, ఎస్‌పి లకు కూడా ఫిర్యాదు చేశామని, ఎన్నికలు క్రమపద్ధతిలో నిర్వహించాలని మేం డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.



# కృష్ణాలో 69.92 శాతం ఓట్లు నమోదు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలు గురువారం కూటమి నేతల దౌర్జన్యాల మధ్య ముగిశాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఉదయం కొంత మందకొడిగా సాగినా 10 గంటల తర్వాత పోలింగ్ ఊపందుకుంది. కృష్ణాలోని 77 పోలింగ్ బూత్‌ల పరిధిలో మొత్తం 63,114 మంది ఓటర్లున్నారు. వీరిలో 44,131 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 69.92 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 35,321 పురుష ఓటర్లలో 25,028 మంది, మొత్తం 27,789 మంది మహిళ ఓటర్లలో 19,103 మంది ఓటు వేశారు. ఉదయం 10 గంటల వరకు 7,859 మంది 12.45 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 19,306 ఓట్లు 30.59 శాతం, రెండు గంటలకు 31,255 మంది 49.52 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన సాయంత్రం నాలుగు గంటలకు 69.92 శాతం ఓట్లు నమోదయ్యాయి.

## బ్యాలెట్ బాక్సులకు భద్రత

**ప్రజాశక్తి - విజయవాడ:** జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ గురువారం రాత్రి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల ద్వారా వచ్చిన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని స్వీకరించి, భద్రపరిచే ప్రక్రియను పరిశీలించారు. చెక్‌లిస్ట్ ప్రకారం సామగ్రి మొత్తం అందుతోందా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్ల వారీగా ఉన్న తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రతతో గుంటూరులోని ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌కు శుక్రవారం ఉదయం ప్రత్యేక వాహనాల్లో పంపుతామని తెలిపారు.



**మొదటిపేజీ తరువాయి**

## పోలింగ్ కేంద్రాల్లో టిడిపి శ్రేణులు హల్‌చల్

ఆయన సతీమణి, మాజీ జడ్పి చైర్పర్సన్ గద్దె అనూరాధ, వారి కుమారుడు ఓటు వేయడానికి పటమట స్కూల్‌లోని పోలింగ్ బూత్‌కు చేరుకున్న సమయంలో ఆలపాటికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు రెచ్చిపోయారు. పోలింగ్ కేంద్రం ప్రాంగణంలోనే హల్‌చల్ చేశారు. అయినా పోలీసులు పట్టనట్లు వ్యవహరించారు. పిడిఎఫ్ అభ్యర్థి తరుపున పనిచేస్తున్న పౌర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్ దోనేపూడి కాశీనాథ్‌తో పోలీసులు వాగ్వాదానికి దిగారు. కూటమి అభ్యర్థి శిబిరాల వద్ద గుంపులు గుంపులుగా ఉన్నా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ హడావుడి చేసినా పోలీసులు, పోలింగ్ అధికారులు మిన్నకుండిపోయారు.

కృష్ణాజిల్లా గుడివాడలోని ఎస్‌విఎస్ స్కూల్ వద్ద కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మద్దతు దారులు నిబంధనలకు విరుద్ధంగా పెద్ద సంఖ్యలో గుంపులుగా ఒక చోటకు చేరారు. ఓటు వేసేందుకు వెళుతున్న ఓటర్లను బూత్‌ల వరకు అనుసరించారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లోపలకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. దీంతో ఓటర్ల వెంట పోలింగ్ బూత్‌ల వరకు వెళ్లొద్దని వారించబోయిన పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మద్దతుదారులతో కూటమి అభ్యర్థి ఆలపాటికి చెందిన కార్యకర్తలు వాదులాటకు దిగారు. దీంతో సిఐటియు నాయకులు ఆర్‌సిపి రెడ్డి జిల్లా ఎస్‌పికి ఫోన్లో ఫిర్యాదు చేశారు. దీంతో అడిషనల్ ఎస్‌పి, డిఎస్‌పిలు పోలింగ్ బూత్ దగ్గరకు సిబ్బందితో వచ్చి కూటమి నేతలు, కార్యకర్తలను చెదరగొట్టారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు 196వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉపాధ్యాయుడు పెదపూడి శ్రీనివాసరావు వెళ్లగా అప్పటికే ఆయన ఓటు పోలైనట్లు అధికారులు చెప్పడంతో అవాక్కయ్యారు.

### బడ్జెట్‌పై ఆశలు!

అంచనాలో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన జలజీవన్ మిషన్ (జెజెఎం) పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తాజాగా రూరల్ ప్రాంతాలకు రూ.6 వేల కోట్లు, పట్టణాలకు మరో రూ.5 వేల కోట్లతో నిధులతో ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. పారిశ్రామిక వృద్ధికి ప్రణాళికలు వేస్తున్న ప్రభుత్వం అధ్వానంగా మారిన ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి, శిథిలమైన వంతెనల నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా సామాజిక పింఛన్లు పెంచి అమలు చేస్తున్నారు. నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి తదితర సంక్షేమ పథకాలకు ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించాల్సి ఉంది. ఈ పథకాలను ప్రభుత్వం ఏవిధంగా ముందుకు తీసుకెళుతుందో చూడాల్సి ఉంది.

## మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటికి పోలీసులు

**ప్రజాశక్తి - విజయవాడ :** వైసిపి అధికార ప్రతినిధి, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ ఇంటికి గురువారం విజయవాడ పోలీసులు వెళ్లారు. వాసిరెడ్డి పద్మ ఫిర్యాదుపై విజయవాడ పోలీసుల విచారణ చేపట్టేందుకు గోరంట్ల మాధవ్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా గోరంట్ల మాధవ్‌కు పోలీసులు నోటీసులు అందించారు. ఆయనకు నోటీసులు ఇవ్వడాన్ని వైసిపి నేతలు ఖండిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# సమిష్టి కృషితో ప్రశాంతంగా పోలింగ్ : ఎస్పి


పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పి గంగాధరరావు

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** ప్రశాంత వాతా వరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి కషిచేసిన ప్రతి ఒక్క పోలీస్ అధికారికి, సిబ్బందికి జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు అభినందనలు తెలిపారు. గురువారం ఉమ్మడి కృష్ణ- గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా సమయ ್ಫూర్తి తో పనిచేసిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినం దిస్తున్నామన్నారు. సిబ్బంది అందరి సమిష్టి కృషి కారణంగానే విజయవంతం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూ రు, పామర్రు, పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను, తదుపరి మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని గూడూరు, మచిలీపట్నం పరిధిలోని జై హింద్ హై స్కూల్, హిందూ కాలేజ్, సెయింట్ ఫ్రాన్సిస్ హై స్కూల్, కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అడిషనల్ అడ్మిన్ వివి నాయుడు గుడివాడ, గన్నవరం సబ్ డివిజన్లు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ అవనిగడ్డ, బందర్ సబ్ డివిజన్ పర్యటించి, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. 15 రూట్ మొబైల్స్ లకు ఎస్సై స్థాయి అధికారులు, 13 స్ట్రైకింగ్ ఫోర్స్‌కు సిఐ స్థాయి అధికారులు, 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ కు డీఎస్పీ స్థాయి అధికారులు ఇన్చార్జిగా వ్యవహరించి ప్రతి బందోబస్తును పటిష్టంగా నిర్వహించామన్నారు.



## కళాకారులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి కి చెందిన శాఖాంబరి మురళీకష్ణ భక్త సమాజం (కోలాటం ) కళాకారులకు పది వేల రూపాయల ఆర్థిక సహాయం గురువారం గ్రామ ఉపసర్పంచ్ మమ్మల్ని రాజ్ కుమార్ (నాని) అందించారు. ఈ సందర్భంగా నాని మాటా ్లడుతూ ప్రాచీన కళలు అంతరించిపోతున్న నేటి తరు ణంలో ఇలాంటి కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొత్త తరం కళాకారులను తయారు చేస్తున్న వేముల అంకం బొట్లు ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణి ప్రభాకర్ రావు, వార్డు సభ్యుడు అంబటి భువ నే శ్వ ర రా వు, వేముల హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

**వృద్ధుడికి రూ. 5 వేలు ఆర్థిక సహాయం**

స్థానిక పడమర వీధిలో నివసిస్తున్న బళ్లా కామేశ్వరరావు గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధ పడుతున్న విషయం తెలుసుకున్న ముమ్మనేని రాజ్ కుమార్ (నాని )ఆర్థిక సహాయం అందించారు.

## ప్రజాసంఘాల కృషి అభినందనీయం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** మండలంలో గురువారం జరిగిన కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలలో ప్రజా సంఘాల కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు అన్నారు. పోలింగ్ ముగిసి నానంతరం స్థానిక సీఐటీయు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి ఓటర్లకు స్లిప్పులు రాస్తూ, బూత్ లో అక్ర మాలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు చేసిన కృషిపట్ల కార్యకర్తలను అభినందించారు. ప్రజాసంఘాల నాయకులు దేవు నాగేశ్వరరావు, కలపాల దానయ్య, మహమ్మద్ పజరుల్లా ఖాన్,మేడేపల్లి వెంకటేశ్వరరావు, నంద్యాల ప్రభు,గోళ్ళ సాంబశివరావు బండారు కోటేశ్వరరావు.పల్లె సుబ్బారావు,ఘంటసాల ధర్మరాజు, మహమ్మద్ కరీముల్లాలను అభినందించారు.


ప్రజాసంఘాల నాయకులు

## నయన మనోహరంగా కళ్యాణం

**ప్రజాశక్తి-మోపిదేవి :** మహాశివరాత్రి పర్వదినాన పెదకళ్ళేపల్లి పుణ్యక్షేత్రంలో లింగోద్భవ కాలంలో పార్వతీ పరమేశ్వర కళ్యాణం అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. స్వామి కళ్యాణంలో దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో నిండిపోయింది. గురువారం తెల్లవారుజామున రెండు గంటల 30 నిమిషాలకు ప్రారంభమైన కళ్యాణం ఐదు గంటలకు ముగిసింది. కళ్యాణ అనంతరం ముత్యాల తలంబ్రాలు పసుపు కుంకుమ శేష వస్త్రాల కోసం కళ్యాణకర్తలుగా పాల్గొన్న దంపతులు పోటీపడ్డారు.



## సీనియర్ పాత్రికేయుడు సురేష్ మృతి



**ప్రజాశక్తి-గన్నవరం :** సీనియర్ పాత్రికేయుడు కుర్మా సురేష్ అనారోగ్యంతో గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్ కొంత కాలం ఆసుపత్రి చికిత్స పొందారు. ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటివద్దనే వుం టున్నారు. ఐతే గురువారం మధ్యా హ్నం హఠాత్తుగా అస్వస్థత గురై మరణించారు. ఎన్నో ఏళ్లుగా పత్రికా రంగంలో వివిధ పత్రికలలో పని చేసిన అపార అనుభవం గడించారు. అందరికీ సౌమ్యుడుగా పలువురు అధికారులకు, రాజకీయనాయకులకు ముఖ్యంగా గన్నవరం ప్రాంత ప్రజలకు సురేష్ తన వార్తలతో సుపరిచితమే. ఆయనకు భార్య,ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. సురేష్ మృతి పట్ల జర్నలిస్టులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున జర్నలిస్టులు సురేష్ భౌతకకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సురేష్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.


పూలతోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

## పూలు, కూరగాయ తోటలు పరిశీలన

**ప్రజాశక్తి-కంకిపాడు :** ఘంటసాలకు చెందిన కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి మంజు వాణి, ఉద్యాన శాఖ అధికారి చందు జోసఫ్ సుందరంలు పెనమలూరు మండలంలోని గోశాల, వనుకూరు గ్రామాల్లో ఉన్న పూల తోటలు, కూరగాయ తోటలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ వి మంజువాణి లిల్లీ పూలతోటలో బ్లాస్సం మిడ్జ్ పురుగు ఆశించడం గమనించి ఈ పురుగు మొగ్గ దశలోనే కాడలో చొరబడి గుడ్లు పెడతాయన్నారు. పొదిగిన లార్వా పూలను తినడం ద్వారా పూలు విచ్చుకున్నప్పుడు పూలు గోధుమ రంగులో మారి కుళ్ళిపోవడం, పూలతోపాటు పూకాడలు కూడా వంకర్లు తిరగడం గమనిస్తామన్నారు. ఈ పురుగు నివారణకు ఆశించిన కాడలను కోసివేసి మంటలో కాల్చివేయాలన్నారు. భూమిపై అధిక తేమ లేకుండా చూసుకో వాలని, దీని కొరకు డ్రిప్ పద్ధతిని అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన నాయకురాలు చాముండేశ్వరి కూడా పాల్గొన్నారు.

## కాపు సంఘం అధ్యక్షుడిగా సాయితేజ

**ప్రజాశక్తి ఘంటసాల :** ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన తాడికొండ సాయి తేజ కాపు సంఘం కృష్ణా జిల్లా యూత్ అధ్యక్షులుగా నియమితులయ్యారు. మంగళగిరిలోని జాతీయ కాపు సంఘం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీ కష్ణ నాయుడు సాయితేజను జాతీయ కాపు సంఘం కృష్ణా జిల్లా యూత్ అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సాయి తేజకు ఇచ్చిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు. జాతీయ కాపు సంఘం కష్ణా జిల్లా యూత్ అధ్యక్షులుగా తాడికొండ సాయి తేజను శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న), కూటమి నేతలు, కార్యకర్తలు, తాడికొండ యూత్ సభ్యులు అభినందించారు.

# దుర్భరంగా దర్జీల బతుకులు



- రెడిమేడ్ వస్త్రాల వల్ల పనుల్లేక కష్టాలు
- పెరిగిన మెటీరియల్ ధరలతో ఇబ్బందులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** టైలరింగ్ రంగంలో దర్జీల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. టైలరింగ్ వత్తినే నమ్ముకున్న తమకు సరిగా పండుగల్లో సైతం పనుల్లేక అర్ధాకలితో పస్తులు ఉంటున్నామని టైలర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకాశాన్నంటుతున్న టైలరింగ్ మెటీరియల్ ధరల తమ జీవనానికి ఇబ్బందులు తెచ్చిపెట్టాయని అంటున్నారు. గుడివాడ నియోజకవర్గంలో దాదాపు 850మంది టైలర్స్ ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'చేదోడు' పథకం కింద ఒక్కో టైలర్‌కు ఏడాదికి రూ.10వేల సాయం అందించేవారని గుర్తు చేసుకుంటున్నారు. ఒక చొక్కా కుట్టించినందుకు మెటీరియల్ పోను తమ కష్టానికి రూ.100 నుంచి రూ.125లే చేతికి వస్తుందని చెబుతున్నారు. రెడీమేడ్ డ్రెస్సులు మార్కెట్‌లోకి రోజుకో విధమైన డిజైన్లలో రక రకాల మోడల్స్ దిగుమతి కావటంతో తమకు పని ఉండడంలేదని అంటున్నారు. సమాజంలో పెరుగుతున్న ఆధునికీకరణ అందాల హెయలను తాము కుట్టే దుస్తుల్లో నైపుణ్యంతో ఒదిగేలా చేస్తున్న ప్రయత్నాలు రెడీమేడ్ వస్త్రాల ముందు ఓటమికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో గ్రామీణ దర్జీకి మనుగడ లేకుండా పోతుందనని ఆందోళనకు గురవుతున్నారు. ఎవరూ ఈ వత్తికి వచ్చేందుకు కూడా రాబోయే తరం వారు ఇష్ట పడటం లేదని చెబుతున్నారు.

### చిన్నప్పట్నించి ఇదే పని

**చిలుకోటి లక్ష్మణరావు, గుడ్లవల్లేరు దర్జీ సంఘ సభ్యుడు**



చిన్నప్పట్నించి టైలరింగ్‌కు తప్ప మరో పనికి వెళ్లలేదు. అప్పట్లో దర్జీకి సమాజంలో మంచి డిమాండ్ ఉండేది. చిన్నపుడు తల్లిదండ్రులు ఈ పనిలోనే పెట్టారు. ప్రభుత్వాలు దర్జీల సంక్షేమానికి నిధులను కేటాయించాలి.

### టైలర్స్‌పై చిన్నచూపు

**వంజరపు కనకారావు, దర్జీ**



ప్రభుత్వం మా దర్జీల అభివృద్ధికి ఏ మాత్రం పని చేయటం లేదు. రెడీమేడ్ మోడల్స్ మార్కెట్‌లో అధికమయ్యేసరికి మేం కుట్టేందుకు కస్టమర్లు ముందుకు రావటం లేదు. మాకు ప్రమాదం జరిగిందంటే పని లేనట్లే. ఈ పని గాక వేరే దారి తెలియక ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రభుత్వమే మేలు చేయాలి.

# ఎంఎల్‌సి ఎన్నికల్లో బెదిరింపులు... దౌర్జన్యాలు

## ఎన్‌టిఆర్ జిల్లాలో 65.69 శాతం పోలింగ్

**ప్రజాశక్తి-విజయవాడ:** గురువారం జరిగిన కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఎన్‌టిఆర్ జిల్లాలో 65.69 శాతం నమోదైంది. జిల్లాలో మొత్తం ఓటర్లు 78,063 మందికి 51,279 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడ సిటీతో పాటు జిల్లా వ్యాప్తంగా 112 పోలింగ్ స్టేషన్ల ద్వారా పోలింగ్ జరిగింది. ఎన్నికల సంఘం నిర్దేశించిన సాయంత్రం 4 గంటలకు పోలింగ్ గడువు ముగిసినా కానీ సాయంత్రం 5.30-6 గంటల వరకు కూడా పలు పోలింగ్ స్టేషన్లలో అడపాదడపగా ఓటర్లు క్యూలైన్లలో ఉండటం కనిపించింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని సివిఆర్ మునిసిపల్ స్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 89ఎ పోలింగ్ బూత్‌లో సాయంత్రం 5.30 గంటల వరకు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో ఓటర్లు ఉండటం గమనార్హం. అయితే నిర్దేశించి గడువు 4 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌ల్లోకి వారిని అనుమతించలేదు. అటువంటి వారు గేటు బయటే కొద్ది సేపు ఉండి ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చింది. పటమట జడ్‌పి హైస్కూల్, సత్యనారాయణపురం ఎకెటిపిఎం స్కూల్, వన్‌టౌన్ గాంధీజి మునిసిపల్ హైస్కూల్ తదితర పోలింగ్ స్టేషన్లలో క్యూలైన్‌లో ఉండి పోలింగ్ సమయం ముగిసినా కానీ ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికలాంగులకు వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచి వారు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసు, ఇతర ఎన్నికల అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (సిసిసి) నుంచి సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేశారు. పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో 450 మంది పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు తీసుకున్నారు. కొన్ని పోలింగ్ సెంటర్లలో పోలీసు అధికారులు మీడియాను అనుమతించలేదు. ఎన్‌జిఒ హోమ్ ఏరియాలో ఉన్న చిట్టూరి స్కూల్‌లో ఒక లేడీ ఎస్‌ఐ మీడియాను స్కూల్ ప్రాంగణంలోకే అనుమతించలేదు. ఆ తరువాత పిఆర్‌ఒ ఆఫీసు తరుపున అక్కడకు విచ్చేసి డిసిపికి ఫోన్ చేయించిన తరువాత ఆ ఎస్‌ఐ లోపలకు అనుమతించడం గమనార్హం.



## జక్కంపూడికాలనీ సమగ్రాభివృద్ధికి చర్యలు

**ప్రజాశక్తి-విజయవాడ:** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం జక్కంపూడి కాలనీలో పర్యటించిన కమిషనర్ ...అక్కడి పరిస్తితులను స్థానిక ప్రజలనుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జక్కంపూడి కాలనీ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస సదుపాయాలయిన రోడ్లు, డ్రైయినేజి, వీధిదీపాలు, మంచినీరు, విద్యా, వైద్యం వంటి వాటికి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలంలో త్రాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యమ్నాయంగా మొక్కలు నాటాలన్నారు. వీధి దీపాలు మరమ్మతులు లేకుండా ఉండాలని, డ్రైనేజ్ సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలని, కమ్యూనిటీ హాల్ లో ఉన్న మరమతులను త్వరితగతిన పూర్తి చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, వ్యర్థాలను, నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పారిశుధ్యంలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెంటింగ్ ఇంజనీర్లు పి సత్యకుమారి, పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆయా పోలింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు.**

**మైలవరం:** మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మైలవరం మండలంలో 64.64 శాతం ఓట్లు నమోదైనట్లు తాసిల్దార్ అబ్దుల్ దరియా, సెక్టార్ ఆఫీసర్ వీరా స్వామి తెలిపారు. మండలంలో 2,605 ఓటర్లకు 1684 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏసిపి ప్రసాద్‌రావు, సిఐ చంద్రశేఖర్లు ఎన్నికల కేంద్రాన్ని పర్యవేక్షించారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు తరపున ఏజెంట్గా కూర్చునేందుకు ఒకరు రాగా అధికార పార్టీ చెందిన కొంతమంది నేతలు భయపెట్టి అతన్ని తీసుకెళ్లారు. **ఎ.కొండూరు:** మండలంలో 72 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి జి.స్వర్ణకుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 1277 ఓట్లు ఉండగా 914 ఓట్లు పోలయ్యాయి. **రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం మండలం జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలింగ్ సరళిని తిరువూరు రెవెన్యూ డివిజన్ అధికారి కె.మాధురి, తహసీల్దార్ జె.సుశీలా దేవి పరిశీలించారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం పట్టణంలో డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో పోలింగ్ నిర్వహించారు. 4495 మంది ఓటర్లకు 3034 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 67.50 శాతం పోలింగ్ నమోదైంది. అడిషనల్ డిసిపి గున్నం రామకృష్ణ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బూతు నెంబర్ 45లో తన ఓటు మరొకరు వేశారంటూ ఓటర్ ఎమ్మార్వో దృష్టికి తీసుకువెళ్లారు. ఓటర్ తన ఓటు మరొకరు ఎలా వేస్తారు అంటూ అధికారులను నిలదీశారు. గుంటుపల్లికి చెందిన ఓటర్ జ్ఞాన దీప్తి పేరుతో మరొకరు ఓటు వేసిన వైనాన్ని ఎన్నికల అధికారులు గుర్తించకపోవడంతో ఏజెంట్ అడ్డుకోవడంతో ఛాలెంజ్‌తో కూడిన టెండర్ ఓటు వేయడానికి ఎన్నికల అధికారి జ్ఞాన దీప్తికి అవకాశం ఇవ్వడంతో ఓటు వేశారు.

## దొంగ ఓట్లు వేసేందుకు యత్నం

### అడ్డుకున్న ప్రజాసంఘాల నాయకులు



టిడిపి నాయకులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు


**ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ బూత్ వద్ద నాలుగు గంటలకు పోలింగ్ ముగిసినా కొంతమంది టిడిపి నాయకులు దొంగ ఓట్లు వేయటానికి ప్రయత్నించడంతో పిడిఎఫ్ అభ్యర్థి తరపున నిలబడిన పోలింగ్ బూత్ ఏజెంట్లు అడ్డుకున్నారు. దీంతో అక్కడ నుండి టిడిపి కార్యకర్తలు జారుకున్నారు. ఏటిపట్టు గ్రామానికి చెందిన ఒక టిడిపి నాయకుడు దొంగ ఓట్లు వేయటానికి ప్రయత్నించాడు. దీనిని ప్రజాసంఘాల నాయకులు కటారపు గోపాల్, గోపి నాయక్ అడ్డుకున్నారు. అదేవిధంగా నందిగామ పట్టణంలో పలువురు టిడిపి కార్యకర్తలు గురువారం సాయంత్రం సమయంలో దొంగ ఓట్లు వేయటానికి ప్రయత్నించడంతో పిడిఎఫ్ అభ్యర్థి తరపున ఉన్న పోలింగ్ బూత్ ఏజెంట్లు అడ్డుకున్నారు. టిడిపి నాయకులు అడుగడుగునా ఓటర్లను అడ్డుకుని ప్రలోభాలకు గురి చేస్తుండటంతో ప్రజా సంఘాల నాయకులు వారిని అడ్డుకున్నారు. కలెక్టర్, ఆర్‌డిఓలకు ఫిర్యాదు చేశారు. దీంతో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము, టిడిపి నందిగామ మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, టిడిపి నాయకులు సురేష్, హనుమంతరావు, రమణ తదితర కార్యకర్తలు ఏజెంట్లు ముసుగులో వచ్చి పోలింగ్‌కు విఘాతం కలిగిస్తుండటంతో నందిగామ ఎసిపి తిలక్, సిఐ వైవిఎల్ నాయుడు అడ్డుకుని పోలింగ్ బూత్ నుండి బయటకు పంపారు.

**విస్సన్నపేట:** విసన్నపేట మండలం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తాసిల్దార్ లక్ష్మీ కళ్యాణి తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఓ మాధురి పరిశీలించారు. మొత్తం 1921 ఓట్లకు 1249 ఓట్లు పోలైనట్లు తాసిల్దార్ తెలిపారు. **జగ్గయ్యపేట:** జగ్గయ్యపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరు పోలింగ్ బూత్‌లలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 4350 మందికి 3061 ఓట్లు పోలయ్యాయి. 70.36 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు. **తిరువూరు:** మండలంలో 86.90 శాతం ఓట్లు పోలయ్యాయి. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూతుల్లో మొత్తం 2,701 ఓట్లు ఉండగా 1861 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్‌డిఓ మాధురీ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. **గంపలగూడెం:** గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1,862 మంది ఓటర్లకు 1,315 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 70.62 శాతం ఓటింగ్ నమోదైంది. **విజయవాడ అర్బన్:** విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మొత్తం 12 పోలింగ్ కేంద్రాల్లో కలిపి 69.36 శాతం నమోదైంది. 8552 మంది ఓటర్లకు 5932 మంది ఓటు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో కృష్ణలంక పొట్టిశ్రీరాములు హైస్కూల్, మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల, రింగ్ రోడ్డు వద్ద గల ఆంధ్ర లయోలా కళాశాల, పటమట కెబిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్లను స్థానిక సదన సభ్యులు గద్దె రామ మోహన్, పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. పటమట స్కూల్లో ఓటింగ్ సరళిని కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. **జి.కొండూరు:** మండలంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన పోలింగ్‌లో 1738 మందికి 1277 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74 శాతం పోలింగ్ నమోదైంది. **కంచికచర్ల:** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మొత్తం 1797 ఓట్లకు 1326 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఇన్చార్జి తహశీల్దార్ మానస తెలిపారు. విజయవాడ డీసీపీ కేఎం మహేశ్వరరావు, నందిగామ ఏసిపి తిలక్ , నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. **వత్సవాయి:** వత్సవాయి జిల్లా పరిషత్ హైస్కూల్లో 70 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## కూటమి నేతల హాల్‌చల్

- దొంగ ఓట్లు వేసిన అధికార పార్టీ!
- పోలింగ్ బూత్‌లలో తిష్ట
- పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లకు బెదిరింపులు

**ప్రజాశక్తి-కంచికచర్ల:** ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతుగా అధికార పార్టీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారు. కంచికచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌లకు పిఒలుగా స్థానిక అధికారులనే ఉన్నతాధికారులు నియమించటంతో పిఒలు ఇతర సిబ్బంది, కూటమి అభ్యర్థికి అనుకూలంగా పని చేసినట్లు పలువురు ఓటర్లు తెలిపారు. పోలింగ్ సమయం గంట ఉందనగా అప్పటి వరకు పోలింగ్ కేంద్రంకు దగ్గరలో తిష్ట వేసుకుని కూర్చున్న అధికార పార్టీ నాయకుడు 50 మంది అనుచరులతో కలిసి పోలింగ్ బూతుల్లోకి చొరబడి దొంగ ఓట్లు వేసినట్లు స్వతంత్ర అభ్యర్థి ఏజెంట్లు తెలిపారు. దొంగ ఓట్లు వేయడాన్ని ప్రశ్నించిన పీడీయఫ్ అభ్యర్థి ఏజెంట్లను బెదిరించారు. బూత్‌లలో కూటమి నాయకులు, కార్యకర్తలు పదుల సంఖ్యలో చొరబడినా పోలింగ్ సిబ్బంది కాని, పోలీసులు కాని, తహశీల్దార్ కాని వారిని కట్టడి చేయకపోగా వారికి సహకరించినట్లు పలువురు ఓటర్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న అక్రమాలపై పీడీయఫ్ అభ్యర్థి మద్దతుదారులు ఉన్నతాధికారూలకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు స్థానిక తహశీల్దార్, ఇతర అధికారులను వివరణ అడిగితే పోలింగ్ సక్రమంగానే జరుగుతుందని చెప్పారని స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు తెలిపారు.




జగ్గయ్యపేటలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్



రెడ్డిగూడెంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

## నా ఓటును ఎలా తొలగించారు?

**ప్రజాశక్తి-వత్సవాయి:** మక్కపేట గ్రామానికి చెందిన కరిసే మధు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళ్లగా సంబంధిత శాఖ అధికారులు ఓటు లేదని తెలియజేయడంతో ఆయన ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఉన్నత విద్యావంతుడై ఎన్నో సంస్థలు నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న మధు ఎన్నికల నియమావళి ప్రకారమే ఓటు నమోదు చేసుకున్నాడు. విఆర్‌ఒ కూడా తనకు ఓటు వచ్చిందని తెలిపారు. దీంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రం వద్దకు రాగా ఓటు లేదని చెప్పడంతో వీఆర్వో ఇచ్చిన నకలుతో, అదేవిధంగా సంబంధిత అధికారి తనకు ఓటు లేదని ఇచ్చిన పత్రంతో పోలింగ్ కేంద్రం వద్ద నిరసన తెలియజేశాడు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఇటువంటి సమస్యలు ఉన్నాయని, గ్రామ రెవెన్యూ అధికారులు ఓటు ఉందని పత్రాలు ఇచ్చినప్పటికీ పోలింగ్ కేంద్రం వద్ద ఆ ఓటు చూపించకపోవడం దారుణమన్నారు. ఉద్దేశపూర్వకంగా తన ఓటును తొలగించిన అధికారిని విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



## చెదురుమదురు ఘటనల మధ్య

# ఎంఎల్‌సి పోలింగ్

- మచిలీపట్నంలో ఓటు వినియోగించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర
- వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి పరిశీలించిన కలెక్టర్ డికె బాలాజీ


అవనిగడ్డలో...


గన్నవరంలో...

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలంలో ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. బాలు ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. తహసిల్దార్ వెంకట శివయ్య పర్యవేక్షించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరిగింది. 4 గంటలకు 70 శాతం పోలింగ్ జరిగిందని అధికారులు తెలిపారు. 124వ బూత్ లో ఎక్కువగా ఓటింగ్ జరిగింది. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించ ుకున్నట్లుగా చెప్తున్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** కష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక చాపరాల సత్యనారాయణ కళాశాలలో పోలింగ్ ను గురువారం నిర్వహించారు. ఉదయం ఓటు హక్కు వినియోగించుకోనేందు ఓ వృద్ధుడు వీల్ చైర్ పై పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటును వినియోగించుకున్నారు. మొత్తం 1475 ఓటర్లు ఉండగా 170 పోలింగ్ బూత్‌లో 502 మంది, 169 బూత్ లో573 మంది ఓటర్లు తమ ఓట్లను వినియోగించుకో 72 శాతం పోలైనట్లు మండలం తాసిల్దార్ బి లోకరాజు తెలిపారు. **ప్రజాశక్తి కోడూరు :** కోడూరు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కోడూరు మండల వ్యాప్తంగా 1416 మంది పట్టభద్రుల ఓట్లకు గాను 934 మంది పట్టభద్రుల తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 595 స్త్రీలు 339 మంది అని 65.శాతం ఓటింగ్ నమోదు అయిందని తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మండలంలోని లంకపల్లి, తాడంకి, మంటాడ, కృష్ణాపురంలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. యూటీఎఫ్ని ఉపాధ్యాయులు అశోక్ కుమార్, సిపిఎం తరఫున ఉయ్యూరు పట్టణ కార్యదర్శి శివ నాగేంద్ర ఖాన్, జహురుద్దీన్ ఖాన్, కాగిత గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశ్తి-తోట్లవల్లూరు :** తోట్లవల్లూరులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు బూతులలో మొత్తం 1312 మంది ఓటర్లకు గాను 923 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 145వ బూత్ లో 528 మంది 146వ బూత్ లో 395 మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారని, మొత్తంగా 70 శాతం ఓటింగ్ జరిగిందని ఎన్నికల అధికారి తాసిల్దార్ కుసుమకుమారి తెలిపారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియను గుడివాడ డి.ఎస్.పి ధీరజ్ వినీల్, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు తదితరులు పరిశీలించారు.**ప్రజాశక్తి చల్లపల్లి (మొవ్వ) :** మొవ్వ మండలంలో గల 1259 మంది ఓటర్లకుగాను 882 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 167వ పోలింగ్ కేంద్రంలో 743 మంది ఓటర్లకు 537 మంది, 168వ నంబరు పోలింగ్ స్టేషన్లో 516 మంది ఓటర్లకు 345 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల కేంద్రాలను గుడివాడ డిఎస్పి ధీరజ్ వినీల్ పరిశీలించారు. కూచిపూడి ఎస్సై ఎం సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ కే మస్తాన్ పర్యవేక్షిం చారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగియగా 71.62 శాతం ఓట్లుపోలయ్యాయి. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా ఉయ్యూరు, మండలపరిధిలో 2,805 ఓటర్లుకు గాను 2009 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో 1086 మంది పురుష లు, 927మం ది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు. ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె శ్రీహరి తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. వద్ధులు, యు వకులు సైతం తరలివచ్చి పొడవాటి క్యూలో నిలుచుని ఓటు వేశారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఓటింగ్ ప్రక్రియ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ఆర్డీవో హేలాషారోన్, పోలింగ్ సరళిని తహసీ ల్దార్ సురేశ్ కుమార్‌లు పరిశీలించారు. సీఐ రామారావు, ఎస్సై విశ్వనాథ్ సిబ్బ ందితో బందో బస్తు నిర్వహించారు. **ప్రజాశక్తి- నందివాడ :** నందివాడ మండలం ప్రైమరీ స్కూల్ బూత్ నెంబర్ 151, పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ను గురువారం నిర్వహించారు. మండలంలో మొత్తం 75.48 పోలింగ్ శాతం పోలైనట్లు మండల తాహసిల్దార్ గురుమూర్తి రెడ్డి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా నందివాడ ఎస్సై శ్రీనివాసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం 9014 ఓట్లు ఉండగా అందులో 6,217 ఓట్లు పోలవగా 68.89 పోలింగ్ నమోదయింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవనిగడ్డ మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలలో 207 7 వాట్లకు గాను 1420 ఓట్లు పోలయ్యాయి. అదేవిధంగా కోడూరు మండలంలో 1461 ఓట్లకు గాను 934 మంది ఓట్లు వేయగా, నాగాయలంక మండలంలో 1100 మందికి గాను 767 ఓట్లు, అలాగే మోపిదేవి మండలంలో 1190 ఓట్లకు గాను 872 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. చల్లపల్లి మండలానికి సంబంధించి 2023 ఓట్లకు గాను 1420 ఓట్లు పోలవ్వగా, ఘంటసాల మండలానికి సంబంధించి 1217 మంది ఓటర్లకు గాను 808 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 193,194 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ 193 పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఇటువంటి అసౌకర్యం కలగకుండా ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే నాగమల్లేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు నిర్వహించారు. కాగా అవనిగడ్డలోని 194 పోలింగ్ కేంద్రంలో ఆఖరిలో ఒక ఓటరు తన పేరు అడ్రస్సును కచ్చితంగా చెప్పలేకపోవడంతో దానిని దొంగ ఓటుగా నిర్ధారించి అధికారులు తిరస్కరించారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండలంలో 2096 ఓట్లు ఉండగా 1526 ఓట్లు పోలయ్యాయని, అలాగే పెనమలూరు మండలంలో మొత్తం 10630 ఓట్లు ఉండగా 7225 ఓట్లు పోలైయ్యాయని అధికారులు తెలిపారు. కంకిపాడు తాసిల్దార్ భవనారాయణ రెవెన్యూ సిబ్బంది, కంకిపాడు ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పోలింగ్‌ను పర్యవేక్షించారు.


నందివాడ మండలంలో..


తోట్లవల్లూరు మండలంలో..


ఉయ్యూరులో...


కలెక్టర్ డికె బాలాజీ


ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

## వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ పరిశీలన


వెబ్‌కాస్టింగ్ పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డీకే బాలాజీ వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. గురువారం కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నుండి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డిఆర్ఓ కే. చంద్రశేఖర రావులతో కలిసి జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తూ, పోలింగ్ అధికారులకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ సంద ర్భంగా జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద, ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు అధికారులు, సిబ్బందితో భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. ఎప్పటికప్పుడు పోలింగ్ శాతాన్ని, పోలైన ఓట్ల సంఖ్యను ఎలక్షన్ కమిషన్ వెబ్ సైట్ లో అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకునేలా పోలింగ్ అధికారులు సిబ్బందిని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ :** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాగంగా మాచవరం హైనీ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే వైకాపా మచిలీపట్నం నియోజక వర్గ ఇన్చార్జి పేర్ని కీర్ణమూర్తి హిందూ కాలేజ్ లో తన ఓటు హక్కు వినియో గించుకున్నారు.



## బ్యాలెట్ బాక్సులను గుంటూరు తరలిస్తాం : కలెక్టర్


**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** మచిలీపట్నం నోబుల్ కళాశాలలో ఏర్పాటుచేసిన రిసెప్షన్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ డికె బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, రెవెన్యూ డివిజనల్ పరిధిలో ఏర్పాటుచేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లకు పట్టిష్ట బందోబస్తుతో పోలింగ్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్నామన్నారు. బ్యాలెట్ బాక్స్‌లకు వేసిన సీళ్ళను నిశితంగా పరిశీలించి తాత్కాలిక స్ట్రాంగ్ రూములో భద్రపరచడం జరుగుతుందన్నారు. ప్రత్యేక ఎస్కార్ట్‌తో గుంటూరులో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రమైన ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలకు తరలి స్తామన్నారు. మార్చి మూడో తేదీన అక్కడ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ తో పాటు మచిలీపట్నం ఆర్డిఓ కే. స్వాతి ఉన్నారు.



## చిన్నారి వైద్యానికి సాయం

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం లోని స్థానిక చింతగుంటపాలెంకు చెందిన యార్లగడ్డ రియాన్ష్ అనే 13 నెలలు చిన్నారి పుట్టుకతోనే జన్యు లోపం వలన హైపోస్పాడియాస్ అనే వ్యాధితో బాధపడుతూ 3 సార్లు ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి. తండ్రి కూడా గత సంవత్సరం పాము కాటుతో చనిపోవడంతో ప్రస్తుతం ఇల్లు కూడా గడవక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మైత్రి ఫౌండేషన్ ప్రతినిధుల బందం గురువారం ఆ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం 30000 రూపాయలు చెక్ రూపంలో అందజేసింది. .ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కె వేణు కుమార్, కార్యదర్శి డి రాధాకష్ణ, సభ్యులు ఆంజనేయ ప్రసాద్,వక్కంటి రమాదేవి అనిల్,అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## బాబోయ్ కోతులు, కుక్కలు..



**ప్రజాశక్తి-గన్నవరం :** కోతులు, కుక్కలు, పందుల బెడదతో గన్నవరం పంచా యతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడు తున్నారు. కేసరపల్లి, దావాజీగూడెం, పురుషోత్తపట్నం, బిబి గూడెం సహా గ్రామీణ ప్రాంతాల్లో పలు చోట్ల ఈ మూడు జాతులతో పిల్లలు, పెద్దలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. మైలవరం, ఆగిరిపల్లి అడవి నుంచి వచ్చిన కోతులతో స్థానికులు భయాం దోళనకు గురయ్యారు. ఇక కోతులు, కుక్కలు జాతులు లేని వీధి లేదంటే అతిశయోక్తి కాదు. జనాన్ని కరవడమే వీటి పని. ఎంతో మంది ఆసుపత్రుల పాలయ్యారు. వీటి బెడద నుంచి రక్షించాలని సంబంధిత అధికారులను ప్రజానీకం కోరుతోంది. కోతుల బెడద నుంచి కాపాడడం కోసం కొండముచ్చులను వీధుల్లో తిప్పాలని, అదేవిధంగా కుక్కలు, పందులను పట్టించాలని విన్నవించారు. పంచాయతీ సహా మిగతా గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు తగిన నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జాతీయ క్రీడల నిర్వహణకు అవకాశమివ్వండి

## ఎంపి పిటి ఉషను కలిసిన ఎంపి కేశినేని, శాప్ చైర్మన్ అనిమిని



సిఎం సమక్షంలో పిటి ఉషను కలిసిన ఎంపి శివనాథ్, శాప్ చైర్మన్ అనిమిని

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** 2028-29లో జరగనున్న 40వ జాతీయస్థాయి క్రీడా పోటీలను ఏపీకి కేటాయించేందుకు కృషి చేస్తానని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాజ్యసభ ఎంపి పిటి ఉష ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి హామీ ఇచ్చారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. గురువారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో పి.టి.ఉషను ఎంపి కేశినేని శివనాథ్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. పిటి ఉషతో ఏపీ క్రీడాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించటంతో పాటు ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో దేశంలోనే అత్యుత్తమంగా రూపొందించిన ఏపీ స్పోర్ట్స్ పాలసీని సిఎం వివరించారని తెలిపారు. అలాగే 2028-29లో జరగనున్న 40వ జాతీయస్థాయి క్రీడాపోటీలను ఏపీకి కేటాయించాలని, జాతీయ పోటీల నిర్వహణకు అనుగుణంగా ఏపీలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు వివరించారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌ను దిగ్విజయంగా నిర్వహించామని సంగతి సీఎం చంద్రబాబు పిటి ఉషకు వివరించారని తెలిపారు. ఇందుకు పి.టి ఉష బదులిస్తూ గతంలో హైదరాబాద్ వేదికగా జాతీయ, ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌ను సమర్థవంతంగా, దిగ్విజయంగా నిర్వహించిన సంగతి విధితమేనని, 40వ జాతీయ క్రీడాపోటీలను ఏపీకి కేటాయిస్తే నిర్వహించగలిగే సమర్థత, అనుభవం తమరికి ఉందని కొనియాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ ఎండీ పీఎస్.గిరీషా, పి.టి.ఉష భర్త వి.శ్రీనివాసన్, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ జాయింట్ సెక్రటరీ ఆకుల రాఘవేంద్ర పాల్గొన్నారు.




## జెడ్ అండ్ ఎస్ బాషి హలీమ్ ప్రారంభం

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** రంజాన్‌ను పురస్కరించుకుని ఉపవాసాలు చేసే ముస్లిం సోదరుల సౌకర్యార్థం హలీం స్టాల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని హైకోర్టు న్యాయవాది ఎంవి రాజారామ్ అన్నారు. గురువారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పంజా సెంటర్లో షేక్ బాషి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెడ్ అండ్ ఎస్ బాషి హలీమ్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సర్వ మానవ సౌభ్రాతత్వంగా మానవాళి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యక్షంగా 200 కుటుంబాలు హలీం స్టాళ్ల ద్వారా జీవనోపాధి పొందుతున్నాయని అన్నారు. హలీమ్ స్టాల్ నిర్వాహకులు షేక్ భాషి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా అత్యంత నాణ్యమైన హలీం, హలీం అనుబంధ ఆహార పదార్థాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హలీమ్ అండ్ ఫాలుదా స్టాల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్‌డి.అన్వర్, కార్యదర్శి అబ్దుల్ సల్మాన్, ఉపాధ్యక్షులు సయ్యద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలైట్ ఎలివేటర్స్ విడుదల

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** ప్రీమియం హోమ్ లిఫ్ట్ రంగంలో ప్రసిద్ధి చెందిన ఎలైట్ ఎలివేటర్స్ అత్యాధునిక ఎలైట్ ఎక్స్300, ఎక్స్300 ప్లస్ హోమ్ లిఫ్ట్‌లను విడుదల చేసినట్లు సంస్థ సిఈఓ విమల్‌బాబు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలిపారు. ఈ వినూత్న జోడింపులు ఆధునిక గృహ చలనశీలతలో కొత్త యుగాన్ని సూచిస్తాయన్నారు. లగ్జరీ, అధునాతన సాంకేతికత, పర్యావరణ పరిరక్షణను మిళితం చేస్తాయని, 2025 నాటికి యుఎస్‌ఏ, కెనడా వంటి కొత్త భౌగోళిక ప్రాంతాలలో తమ మార్కెట్ ఉనికిని, కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికలతో, కంపెనీ హోమ్ లిఫ్ట్ అనుభవాన్ని పునర్నిర్వచించనుందని తెలిపారు.

## ఆజాద్‌కు నివాళి

**ప్రజాశక్తి-తిరువూరు:** దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వాళ్లను ఎదిరించి ప్రాణ త్యాగం చేసిన విప్లవవీరుడు చంద్రశేఖర్ ఆజాద్



వర్ధంతిని గానుగపాడు సచివాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.రాంప్రదీప్, గ్రామ సచివాలయ సిబ్బంది మహమ్మద్ మదిని, బర్రె చరణ్ తేజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శక్తి గ్రూపు విస్తరణకు ప్రణాళికలు

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** సోలార్ పంపులు, మోటార్ల తయారీ సరఫరాదారు శక్తి పంపులు సంస్థ రూ.1700 కోట్ల గణనీయమైన పెట్టుబడిని ప్రకటించిందని సంస్థ చైర్మన్ దినేష్.పి ఒక ప్రకటనలో తెలిపారు. 64 హెక్టార్ల పారిశ్రామిక భూమిలో జరగనున్న విస్తరణ ద్వారా పునరుత్పాదక ఇంధన సౌర వేఫర్‌ల నుండి సౌర ఘటాలు, సౌర పంపింగ్ వ్యవస్థలు మరియు విద్యుత్ వాహన భాగాల కోసం అత్యాధునిక తయారీ యూనిట్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఇది రాష్ట్రంలో భారీ ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, ఈ ప్రాజెక్టులలో ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత, శక్తి పంపులు పంపులు, మోటార్లు, సౌర ఫలకాలు, నిర్మాణాలు, ఇన్వర్టర్లు మొదలైన సౌర పంపింగ్ పరిశ్రమ యొక్క అన్ని అవసరాలను తయారు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న దేశంలోనే మొదటి కంపెనీ అవుతుందని తెలిపారు. 1982లో స్థాపించబడిన శక్తి పంపులు మార్కెట్లో 40 సంవత్సరాలకు పైగా గొప్ప వారసత్వాన్ని కలిగి ఉందని తెలిపారు. ఈ కంపెనీ గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, సౌర, మురుగునీటి పంపులతో సహా విస్తృత శ్రేణి పంపులను అందిస్తుందని, ఇవి విస్తృత శ్రేణి అవసరాలను తీరుస్తాయని తెలిపారు.

## ఐఒటితో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



**ప్రజాశక్తి-వన్‌టౌన్:** వన్‌టౌన్‌లోని పిఎస్‌సిఎంఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ అక్బర్ సారథ్యంలో 'భవిష్యత్తును ఐఒటితో నిర్మించడం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న సదస్సును సెన్స్ సెమీకండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (మంగళగిరి) సీఈఓ సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సెమీకండక్టర్ టెక్నాలజీలపై విశ్లేషణాత్మక జ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ప్రాక్టికల్ సెషన్లు, లైవ్ డెమోలను అందించడం ద్వారా విద్యార్థులకు, పరిశ్రమల అవసరాలకు కావలసిన నైపుణ్యాలను పెంపొందించుకునేలా మార్గ దర్శనం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఐఒటితో సెమీకండక్టర్, డేటా సైన్స్ రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా సన్నద్ధమవ్వాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రతి ఒక్క ఈవెంట్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ చిత్త అమర్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. పతంజలి శాస్త్రి, విభాగ అధ్యాపకులు నవ్యశ్రీ, బుష్రా, సురేష్, ఫాతిమా పాల్గొన్నారు.

## అంకమ్మ తల్లి జలబిందెల మహోత్సవం



**ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ పట్టణంలో రెవెన్యూ కాలనీలోని అంకమ్మ తల్లి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దుర్గాదేవి ఆలయాల్లో మహాశివరాత్రి తిరునాల్ల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం భద్రకాళి సహిత వీరభద్ర స్వామి దివ్య కళ్యాణం నిర్వహించారు. గురువారం మేళ తాళాలు మంగళ వాయిద్యా నడుమ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయం నుండి అంకమ్మ తల్లి జలబిందెల మహోత్సవం నిర్వహించారు. యాత్రికులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి దేవాలయంలో 108 కిలోల తేనె, 18 రకాల సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఆలయ ఉప ప్రధాన అర్చకులు దండిభట్ల బాలకృష్ణ శాస్త్రి, ముఖ్య అర్చకులు యడవల్లి సీతారామ ప్రసాద్, పవన్ కుమార్ నిర్వహించారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని శాంతినగర్‌కి చెందిన దేవిశెట్టి జ్వాలా నరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మరణించినారు. అదే విధంగా శాంతినగర్ కి చెందిన మురుకోట్ల కోటేశ్వరావు అనారోగ్యం కారణంతో హాస్పటల్లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలను నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన విభాగ అధ్యక్షులు రామిని ఉపేందర్ రెడ్డి, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన మాజీ డైరెక్టర్ నంబూరి రవి, తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**వత్సవాయి:** పెనుగంచిప్రోలు మండలం కొల్లికొళ్ల గ్రామానికి చెందిన 40 మంది బస్సులో మల్లన్న దర్శనార్థం శ్రీశైలం వెళ్లారు. దీనిలో భాగంగా శ్రీశైలం డ్యాం వద్ద కృష్ణా నదిలో స్నానాన్ని ఆచరిస్తుండగా మునిగిపోతున్న కొడుకు వాసును కాపాడబోయి తండ్రి గురవయ్య మరణించారు. తండ్రీకొడుకుల మృతదేహాలను గురువారం తన్నీరు నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మండల అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కిషోర్, మాజీ సొసైటీ అధ్యక్షులు ముక్కంటి పాల్గొన్నారు.



వత్సవాయిలో తండ్రీకొడుకులకు నివాళులర్పిస్తున్న నాగేశ్వరరావు

## ముక్తేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ముక్త్యాల గ్రామంలోని శ్రీ భవాని ముక్తేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం బుధవారం రాత్రి ఆఘనంగా నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరు సురేష్ బాబు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లాతో పాటు గుంటూరు జిల్లా, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా, ఖమ్మం జిల్లాల నుండి సైతం యాత్రికులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 12 గంటల సమయంలో స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఉంచి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిపి సిమెంట్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## చెరువులో పడి యువకుడు మృతి

**ప్రజాశక్తి-మైలవరం**

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి మైలవరంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మైలవరం చెందిన ఉయ్యాల శ్రీనివాసరావు (29) రాత్రి బహిర్భూమికి ఇంటి సమీపంలో ఉన్న చిన్న చెరువు కట్ట వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలకు ఖండన

**ప్రజాశక్తి జగ్గయ్యపేట**

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తీరును రాష్ట్ర ప్రజలు గ్రహిస్తూనే ఉన్నారని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. డిప్యూటీ సీయం పవన్ కల్యాణ్ పై, కూటమి ప్రభుత్వంపై దువ్వాడ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం తన నివాసంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేశ్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ కి నెలనెలా రూ. యాభై కోట్లు ముడుపుల రూపంలో వస్తున్నాయంటూ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని అన్నారు. నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లడితే సహించబోమని చెప్పారు.కౌన్సిలర్ కొలగాని రాము, మైనారిటీ నాయకులు షేక్ సత్తార్, కోసూరి ప్రహ్లాద్, ఈమని కిషోర్ పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద నిరోధక చర్యలు ఉండాలి : ధ్యానచంద్ర



**ప్రజాశక్తి - విజయవాడ :** అగ్ని ప్రమాదక నిరోధక చర్యలు కచ్చితంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం 58వ డివిజన్, అజిత్ సింగ్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ లోగల కార్తికేయ హాస్పిటల్ ను సందర్శించి అగ్ని ప్రమాదక నిరోధక చర్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ వారి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందాలంటే కచ్చితంగా అగ్ని ప్రమాదక నిరోధక చర్యలు పాటించాలని అన్నారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఎస్టింగ్విషర్ ద్వారా అగ్నిని ఎలా ఆర్పుతారు, ప్రజల భయభ్రాంతులకు గురవకుండా వారిని అగ్ని నుండి ఎలా కాపాడుతారు వంటి అంశాలపై అక్కడున్న సిబ్బందితో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. హాస్పిటల్ మొత్తంలో ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఎక్కడెక్కడ ఉన్నాయి, అవి అక్కడ ఉన్నాయని ప్రజలకు తెలిసేటట్టు దారిలో రేడియం స్టిక్కర్లు అమర్చాలని, హాస్పిటల్ మొత్తంలో సెట్ బ్యాక్ లు సరిగా ఉన్నాయా లేదా అని, స్వయంగా తానే హాస్పిటల్ మొత్తం తిరిగి పరిశీలించారు. ఈ పర్యటనలో ఇంచార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెంటింగ్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్య కుమారి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలో మరమ్మతులు పూర్తి చేయాలి

**ప్రజాశక్తి - విజయవాడ :** స్మశాన వాటికలో ఉన్న మరమ్మతులన్నీ పూర్తి చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. గురువారం ఉదయం కండ్రిక జంక్షన్,ఇన్నర్ రింగ్రోడ్ వద్దగల హిందువుల, ముస్లింల, క్రైస్తవుల స్మశాన వాటికలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మశాన వాటికలో కావలసిన సౌకర్యాలన్నీ ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న సౌకర్యాల్లో ఎటువంటి మరమ్మతులు ఉన్నా త్వరితగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని. ప్రజలకు అవసరమయ్యే మరుగుదొడ్లు , నీటి సరఫరా, షెడ్ ఏర్పాటు చేయాలని, ప్రాంతం మొత్తం పరిశుభ్రంగా ఉంచుటకు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి పాల్గొన్నారు.

## మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం : మొండితోక

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ఆలోచన చేసింది ఎవరో.. అడుగులు వేసింది ఎవరో.. ప్రజలందరికీ తెలుసు అని ఎంఎల్సి డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ విమర్శించారు. గురువారం నందిగామలో ఎంఎల్సి ఓటింగ్ వేసిన అనంతరం అరుణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సత్య కుమార్ నందిగామ నియోజకవర్గానికి వచ్చేటప్పుడు, ఆ నియోజకవర్గ పరిస్థితుల పై - జరిగిన అభివద్ధి పై వ్యాఖ్యలు చేసేటప్పుడు పూర్తిగా, క్షుణ్ణంగా తెలుసుకొని మాట్లాడటం మంచిదన్నారు.

# బరితెగింపు

- ఓటర్లను, పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేస్తూ..
- రింగ్గింగుకు పాల్పడిన మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న

**ప్రజాశక్తి-విజయవాడ :** ప్రభుత్వం అండ చూసుకొని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి నాయకులు బుద్దా వెంకన్నతో పాటు ఆపార్టీ నేతలు ఎల్ మోహన్, పి మాదవ్, డూండీ, బి శ్రీనివాసరావు బరితెగించారు. విచ్చల విడిగా వన్టౌన్లో అన్ని పోలింగ్ బూతుల్లో రిగింగ్, దొంగ ఓట్లు వేయడాలు వంటి అక్రమాలకు పాల్పడిన వ్యవహారం తీవ్ర దుమారాన్ని రేపుతోంది. ఓటర్లతో పాటు ప్రత్యర్థి అభ్యర్ది (పిడిఎఫ్) తరుపు ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేయడమే గాక, వారిపై దాడికి పూనుకొని, వన్టౌన్ పరిధిలోని పోలింగ్ బూతులన్నింటిలోకి చొరబడి రింగింగ్కు పాల్పడిన వైనం పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయ, అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అయింది. బుద్దా వెంకన్న, వారి బృందం సభ్యులు యధేచ్చగా రిగింగ్కు పాల్పడుతున్న క్రమంలోనే స్వయంగా పోలీసు అధికారి (డి.సి.పి) ఎదుట పడి, ఆయన నిలువరించే దాక వెళ్లినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. వన్టౌన్లో వీరు చేసిన వీరంగం, ఆగడాలే కాకుండా తమపై దౌర్జన్యానికి దిగిన బుద్దా వెంకన్నతో పాటు వారి బృంధంలోని సభ్యులపై తక్షణమే విచారించి చర్య తీసుకోవాలని వన్టౌన్లోని 79ఎ పోలింగ్ బూత్ ఏజెంట్గా విధులు నిర్వహించిన ఈసా విజయలక్ష్మీ ఏకంగా ప్రిసైడింగ్ ఆఫీసర్కు గురువారం లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో పేర్కొన్న అంశాల ప్రకారం...విజయవాడ పశ్చిమ మండలం, విద్యాధరపురం ఆర్టీసి ట్రైనింగ్ సెంటర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 79ఎ పోలింగ్ స్టేషన్లో గురువారం మధ్యాహ్నం 3-3.30 గంటల సమయములో మాజీ ఎమ్మెల్సీ, టిడిపి నాయకులు బుద్దా వెంకన్నతోపాటు ఆపార్టీ నాయకులు ఎల్ మోహన్, పి మాధవ్, డూండీ, బి శ్రీనివాసరావు తదితర బృందం 79ఎ పోలింగ్ స్టేషన్లోకి అక్రమంగా చొరబడి రిగింగుకు పాల్పడ్డారు. పోలింగ్ అధికారులను బెదిరించారు. దౌర్జన్యం చేసి, ఎన్నికల బ్యాలెట్ పేపర్లను అధికారి నుంచి బలవంతంగా లాక్కున్నారు. కాగితాలు లాక్కున్న తరువాత సిసి కెమెరాల వైర్ కనెక్షన్లను తప్పించడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. అధికారులందరినీ బయటకు వెళ్లమని, ఓట్లు రిగ్గింగు (దొంగ ఓట్లు)కు ప్రయత్నించారు.

ఈ క్రమంలో పిడిఎఫ్ అభ్యర్ధి కెఎస్ లక్ష్మణరావు తరుపున ఎన్నికల ఏజెంట్గా ఉన్న తాను బుద్దా వెంకన్న , వారి బృందం ఆగడాలు, దౌర్జన్యాలను నిలువరించే ప్రయత్నం చేశాను. అయితే వారు తనను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు గెంటేయడానికి బలవంతంగా మగవారితో తోపించే ప్రయత్నం చేశారు. నన్ను బెదిరించారు. నాపై దాడి చేయడానికి బృందాన్ని ఉసికొల్పారు. బూత్ తలుపులు వేసి పలు విధాలుగా దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఎన్నికలు అయ్యాక తన సంకతులు చూస్తామని బుద్దా వెంకన్న బృందం హెచ్చరించింది. బ్యాలెట్ పేపర్లు లాక్కొన్నాక అక్కడ ఉన్నవారందరూ బయటకు వెళ్లాలని హెచ్చరించారు. ఎటువంటి అనుమతి లేకుండా, ఎమ్మెల్సీ ఓటు హక్కుకూడా లేకుండా పోలింగ్ బూత్లోకి చొరబడి, బ్యాలెట్లను అధికారి నుంచి లాక్కొని, తనపై దౌర్జన్యానికి దిగిన వారందరినీ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తనపై ఎటువంటి దౌర్జన్యాలు వారి నుంచి జరగకుండా తగిన భద్రత కల్పించాలని జిల్లా అధికారులతో పాటు పి.ఒను కోరుతున్నానని విజయలక్ష్మీ కోరారు.

## పోలింగ్ దృశ్యమాలిక



గుడివాడలో బారులు తీరిన ఓటర్లు



ఓటు వేసినట్లు చూపిస్తున్న గుడివాడ ఎంఎల్ఎ



గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు దంపతులు



గుడ్లవల్లేరు మండలంలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధుడు



గన్నవరం మండలంలో...



మోపిదేవి మండలంలో..



ఉయ్యూరులో బారులుతీరిన ఓటర్లు



పమిడిముక్కల మండలంలో...



## 25వ రోజుకు వెటర్నరీ విద్యార్థుల దీక్ష

**ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా) :** మెడికల్ విద్యార్థుతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలియని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె. వి. వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఎన్టీఆర్ వెటర్నరీ విద్యార్థులు చేస్తున్న రిలే నిరహరదీక్ష 25 రోజుకు చేరింది. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ముక్కామల ఉమా మ మహేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కెవివి ప్రసాద్ మాట్లాడుతూ మూగజీవలకు వైద్యం చేస్తున్న డాక్టర్లను ఇబ్బందులు పెట్టటం సరికాదు అన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరవు మాట్లాడుతూ ముగజీవాలకు వైద్యం చేస్తున్న డాక్టర్లులకు అన్యాయం చేయడం తగదని అన్నారు. విద్యార్థులు సమస్యలు పరిష్కరించే వరకు మద్దతు ఇస్తామని అన్నారు.

## గుడివాడ డివిజన్లో 69.01 శాతం పోలింగ్


**ప్రజాశక్తి - గుడివాడ :** కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గంలో గురువారం 69.01 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలను గుడివాడ రెవెన్యూ డివిజన్లో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ బూత్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. ఉదయం నుంచే యువత అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒక్క గుడివాడ మున్సిపల్, గుడివాడ రూరల్కి సంబంధించి 10 బూత్లలో 8,107 ఓట్లకు గాను 5,320 ఓట్లు పోలయ్యాయి. ఒక్క గుడివాడలోనే 65.6శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికలలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఎస్పిఎస్ మున్సిపల్ హైస్కూలులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి యువత ముందుకు వచ్చారు.

## డీసిల్టింగ్ పనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలి

**ప్రజాశక్తి - విజయవాడ :** డిసిల్టింగ్ పనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం సర్కిల్ 3 పరిధిలోగల మహానాడు రోడ్డు చివర గల బళ్ళం వారి వీధిలో ఉన్న గుంట తిప్ప ఔట్ఫాల్ డ్రైన్ ను పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఉన్న అవుట్ ఫాల్ డ్రైన్ ల లో నిరంతరం డీసెల్టింగ్ ప్రక్రియను పూర్తి చేస్తూ ఉండాలని, వర్షం పడిన రోడ్డుపైన నీరు నిల్వ ఉండకుండా వర్షపు నీరు సైడ్ డ్రైన్ లలో ప్రవాహం ఉండేటట్టు చూసుకోవాలని. అధికారులు పర్యవేక్షిస్తూ మైనర్, మీడియం, మేజర్ డ్రైన్ లను నిరంతరం డీసిల్టింగ్ చేస్తుండాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాహనాలను, సిబ్బందిని పెంచి వర్షాకాలం రాకముందే నగరంలో డీసిల్టింగ్ ప్రక్రియ మొత్తం పూర్తి అయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి, ఇన్చార్జ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



# ఎంఎల్‌సి ఎన్నికల చిత్రాలు


ఓటు హక్కు వినియోగించుకున్న జెసి నాయకులు విద్యాసాగర్, ఎంపి శివనాథ్


విజయవాడలోని పటమట పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు


సెల్‌ఫోన్లు భద్రపరుస్తూ... ఓటర్లు




పోలింగ్ అనంతరం సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ


తంగిరాల సౌమ్య


శ్రీరామ్ రాజగోపాల్




ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్తున్న చంద్రబాబు, లోకేష్


పోలింగ్ వివరాలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ బోండా


ఎన్నికలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ


ఓటర్లను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎన్నికల సంఘం అధికారులు


ఓటు వినియోగించుకున్న ఎంఎల్ఎ గద్దె



సిఐటియు రాష్ట్ర నాయకురాలు సుబ్బరావమ్మ



## దుర్గమ్మను దర్శించుకున్న నటుడు సందీప్‌కిషన్

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** విజయవాడలో సినీ నటుడు సందీప్ కిషన్ సందడి చేశారు. తాను నటించిన మజాకా చిత్రం విజయవంతం అయిన సందర్భంగా ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ తాను నటించిన 30వ చిత్రం మజాకా చిత్రానికి థియేటర్‌లో మంచి ఆదరణ వస్తుందన్నారు. ప్రతిఒక్కరు ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. ప్రస్తుతం కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జై సన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో నటిస్తున్నట్లు చెప్పారు. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో ఒక వెబ్ సిరీస్, అమెజాన్‌లో ఫ్యామిలీ మెన్ సీజన్-3లో చేయబోతున్నట్లు తెలిపారు.

## సంగమేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**ప్రజాశక్తి-నందిగామ:** దాములూరు కూడలి గ్రామంలో పార్వతీ సహిత సంగమేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా గురువారం రాత్రి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పవన్ కళ్యాణ్, ఆలయ ఈవో నారాయణ నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు దాములూరు శ్రీనివాస్ శర్మ, వేద పండితులు యనమదల రాజేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పూలతో అలంకరించిన కళ్యాణ వేదికపై పార్వతీ సహిత సంగమేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించారు. గోళ్లమూడి గ్రామంలో శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి 108 కిలోల పలు రకాల పుష్పాలతో అష్టోత్తర సహస్రనామ పుష్పాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు.

### కూడలి తిరునాళ్లలో అలరించిన నృత్యాలు

దక్షిణ కాశీగా పేరుగాంచిన నందిగామ మండలం దాములూరు కూడలి శ్రీ సంగమేశ్వర స్వామి తిరునాళ్ల మహెూత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళావేదికపై నటరాజ నాట్య కళామండలి వారిచే కూచిపూడి





భరతనాట్యం జానపద నత్యాలు, రేలారే రేలా ప్రదర్శనను అందరనీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద సంస్కతిక కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్ఫూర్తి కళ సంస్కతిక సేవాసమితి అధ్యక్షురాలు మన్నే కళావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కూచిపూడి, భరతనాట్యం ,జానపద, రేలారే రేలా కళాకారులను కళావతి శాలవాతో మూమెంట్లతో సత్కరించారు. సాయి కష్ణ మహిళా కోలాట భజన మండలి సభ్యులను ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు, ఆలయ ఈవో నరసింహమూర్తి, పలు గ్రామాల నాయకులు చెరుకూరు హైమారావు తోట నాగమల్లేశ్వరరావు, మన్నేపల్లి వినయ్ కుమార్, నేల వల్లి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు. సంస్కతిక కార్యక్రమాలకు పల్లెల్లో ఆదరించి విజయవంతం చేయడం కళాకారులను ఆదరించి గౌరవించి సత్కరించడం అభినందినీయమని కళాకారులు సభాముఖంగా తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

## నందిగామలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి

### ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-నందిగామ: త్వరలోనే నందిగామలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. గురువారం నందిగామ కాకాని నగర్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కూటమి నేతలతో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. గత ఎనిమిది నెలల నుంచి ఇచ్చిన హామీలు నెరవేర్చుకుంటూ ఆర్థిక వనరులు చేకూర్చుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలో నెట్టిందని విమర్శించారు. కూటమి హయాంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే నందిగామలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్